# యోహాను సువార్త 9వ అధ్యాయము

### యేసు ప్రపంచమునకు వెలుగు

ఆయన మార్గమున పోవుచుండగా పుట్టుగ్రుడ్డియైన యొక మనుష్యుడు కనబడెను. 2 ఆయన
శిష్యులు – బోధకుడా, వీడు గ్రుడ్డివాడై పుట్టుటకు ఎవడు పాపము చేసెను? వీడా, వీని కన్నవారా? అని
ఆయనను అడుగగా, 3 యేసు – "వీడైనను వీని కన్నవారైనను పాపము చేయలేదు గాని, దేవుని క్రియలు
వీనియందు ప్రత్యక్షపరచబడుటకే వీడు గ్రుడ్డివాడుగా పుట్టెను. 4 పగలున్నంత వరకు నన్ను పంపినవాని
క్రియలు మనము చేయు చుండవలెను రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు. 5 నేను ఈ
లోకములో ఉన్నప్పుడు లోకమునకు వెలుగును" అని చెప్పెను.

### యేసు పుట్టు గ్రుడ్డివానిని స్వస్థపరచుట

6 ఆయన ఇట్లు చెప్పి నేల మీద ఉమ్మివేసి, ఉమ్మితో బురదచేసి, వాని కన్నుల మీద ఆ బురద పూసి,
7 "నీవు సిలోయము కోనేటికి వెళ్లి అందులో కడుగు కొనుము" అని చెప్పెను. సిలోయమను మాటకు
పంపబడిన వాడని అర్థము. వాడు వెళ్లి కడుగుకొని చూపుగలవాడై వచ్చెను. 8 కాబట్టి పొరుగువారును, వాడు
భిక్షకుడని అంతకు ముందు చూచినవారును – వీడు కూర్చుండి భిక్షమెత్తుకొనువాడు కాడా? అనిరి. 9 వీడే
అని కొందరును, వీడుకాడు, వీని పోలియున్న యొకడని మరికొందరును అనిరి వాడైతే – నేనేయనెను. 10
వారు – నీ కన్నులేలాగు తెరవబడెనని వాని నడుగగా, 11 వాడు – యేసు అను నొక మనుష్యుడు బురద
చేసి నా కన్నులమీద పూసి నీవు సిలోయమను కోనేటికి వెళ్లి కడుగుకొనుమని నాతో చెప్పెను నేను వెళ్లి
కడుగుకొని చూపు పొందితిననెను. 12 వారు – ఆయన ఎక్కడనని అడుగగా, వాడు – నేనెరుగననెను.

### పరిసయ్యులు స్వస్థత పొందినవానిని బహిష్కరించుట

13 అంతకుముందు గ్రుడ్డియైయుండిన వానిని వారు పరిసయ్యుల యొద్దకు తీసికొనిపోయిరి. 14
యేసు బురదచేసి వాని కన్నులు తెరచిన దినము విశ్రాంతి దినము. 15 వాడేలాగు చూపుపొందెనో దానిని
గూర్చి పరిసయ్యులు కూడ వానిని మరల అడుగగా, వాడు – నా కన్నులమీద ఆయన బురద ఉంచగా నేను
కడుగకొని చూపు పొందితినని వారితో చెప్పెను. 16 కాగా పరిసయ్యులలో కొందరు – ఈ మనుష్యుడు
విశ్రాంతిదినము ఆచరించుట లేదు గనుక దేవుని యొద్దనుండి వచ్చినవాడు కాడనిరి. మరికొందరు –
పాపియైన మనుష్యుడు ఈలాటి సూచక క్రియలేలాగు చేయగలడనిరి ఇట్లు వారిలో భేదము పుట్టెను. 17
కాబట్టి వారు మరల ఆ గ్రుడ్డివానితో అతడు నీ కన్నులు తెరచినందుకు నీవతని గూర్చి ఏమనుకొనుచున్నావని
అడుగగా, వాడు – ఆయన ఒక ప్రవక్త అనెను. 18 వాడు గ్రుడ్డివాడైయుండి చూపు పొందెనని యూదులు
నమ్మక, చూపు పొందినవాని తల్లిదండ్రులను పిలిపించి, –19 గ్రుడ్డివాడై పుట్టెనని మీరు చెప్పు మీ కుమారుడు
వీడేనా? అలాగైతే ఇప్పుడు వీడేలాగు చూచుచున్నాడని వారిని అడిగిరి. 20 అందుకు వాని తలిదండ్రులు –
వీడు మా కుమారుడనియు వీడు గ్రుడ్డివాడుగా పుట్టెననియు మేమెరుగుదుము. 21 ఇప్పుడు వీడేలాగు
చూచుచున్నాడో ఎరుగము ఎవడు వీని కన్నులు తెరచెనో అదియు మేమెరుగము వీడు వయస్సు
వచ్చినవాడు, వీనినే అడుగుడి తన సంగతి తానే చెప్పుకొనగలడని వారితో అనిరి. 22 వాని తలిదండ్రులు
యూదులకు భయపడి ఈలాగు చెప్పిరి ఎందుకనిన ఆయన క్రీస్తు అని ఎవరైనను ఒప్పుకొనిన యెడల వానిని

సమాజమందిరములోనుండి వెలివేతుమని యూదులు అంతకు మునుపు నిర్ణయించుకొని యుండిరి. 23
కావున వాని తలిదండ్రులు - వాడు వయస్సు వచ్చినవాడు వానిని అడుగుడనిరి. 24 కాబట్టి వారు
గ్రుడ్డివాడైయుండిన మనుష్యుని రెండవ మారు పిలిపించి - దేవుని మహిమపరచుము ఈ మనుష్యుడు
పాపియని మేమెరుగుదుమని వానితో చెప్పగా, 25 వాడు - ఆయన పాపియో కాడో నేనెరుగును ఒకటి
మాత్రము నేనెరుగుదును నేను గ్రుడ్డివాడనైయుండి ఇప్పుడు చూచుచున్నాననెను. 26 అందుకు వారు -
ఆయన నీకేమి చేసెను? నీ కన్నులు ఏలాగు తెరచెనని మరల వానిని అడుగగా, 27 వాడు - ఇందాక మీతో
చెప్పితిని గాని మీరు వినకపోతిరి మీరెందుకు మరల వినగోరుచున్నారు? మీరును ఆయన శిష్యులగుటకు
కోరుచున్నారా ఏమి? అని వారితో అనెను. 28 అందుకు వారు - నీవే వాని శిష్యుడవు, మేము మోషే
శిష్యులము 29 దేవుడు మోషేతో మాటలాడెనని ఎరుగుదుము గాని వీడెక్కడనుండి వచ్చెనో యెరుగమని
చెప్పి వానిని దూషించిరి. 30 అందుకు ఆ మనుష్యుడు - ఆయన ఎక్కడనుండి వచ్చెనో మీరెరుగకపోవుట
ఆశ్చర్యమే అయినను ఆయన నా కన్నులు తెరచెను. 31 దేవుడు పాపుల మనవి ఆలకింపడని
యెరుగుదుము ఎవడైనను దేవభక్తుడైయుండి ఆయన చిత్తముచొప్పున జరిగించిన యెడల ఆయన వాని
మనవి ఆలకించును. 32 పుట్టు గ్రుడ్డివాని కన్నులెవరైన తెరచినట్టు లోకము పుట్టినప్పటినుండి వినబడలేదు.
33 ఈయన దేవుని యొద్ద నుండి వచ్చిన వాడు కానియెడల ఏమియు చేయనేరడని వారితో చెప్పెను. 34
అందుకు వారు - నీవు కేవలము పాపివై పుట్టినవాడవు, నీవు మాకు బోధింపవచ్చితివా అని వానితో చెప్పి
వాని వెలివేసిరి.

## స్వస్థత పొందినవాడు యేసును అంగీకరించుట

35 పరిసయ్యులు వానిని వెలివేసిరని యేసు విని వానిని కనుగొని - "నీవు దేవుని కుమారుని
యందు విశ్వాసముంచు చున్నావా?" అని అడిగెను. 36 అందుకు వాడు - ప్రభువా, నేను ఆయనయందు
విశ్వాసముంచుటకు ఆయన ఎవడని అడుగగా, 37 యేసు -" నీవాయనను చూచుచున్నావు నీతో
మాటలాడుచున్నవాడు ఆయనే అనెను." 38 అంతట వాడు - ప్రభువా, నేను విశ్వసించుచున్నానని చెప్పి
ఆయనకు మ్రొక్కెను. 39 అప్పుడు యేసు -" చూడనివారు చూడవలెను, చూచువాడు గ్రుడ్డివారు కావలెను,
అను తీర్పు నిమిత్తము నేనీలోకమునకు వచ్చితిని" అని చెప్పెను. 40 ఆయన యొద్దనున్న పరిసయ్యులలో
కొందరు ఈ మాట విని - మేమును గ్రుడ్డివారమా అని అడిగిరి. 41 అందుకు యేసు - "మీరు గ్రుడ్డివారైతే
మీకు పాపము లేక పోవును గాని- చూచుచున్నామని మీరిప్పుడు చెప్పుకొనుచున్నారు గనుక మీ పాపము
నిలిచియున్నది" అని చెప్పెను.